క్లుప్తంగా

బంగారు భవితకు అందమైన చేతిరాత ఎంతో కీలకం



మంచికల్లు(రెంటచింతల): బంగారు భవితకు అందమైన చేతిరాత ఎంతో కీలకమని మంచికల్లు ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం నంబూరు వీర వసంతకుమారి అన్నారు. గురువారం జాతీయ చేతిరాత దినోత్సవం పురస్కరించుకుని పాఠశాలలోని విద్యార్థులకు ఆమె చేతిరాత పోటీలను నిర్వహించి బహుమతులను అందచేసి మాట్లాడారు. చేతిరాత బాగుంటే పరీక్షలలో మంచి మార్కులు వస్తాయన్నారు. చిన్న తరగతుల నుంచే తల్లిదండ్రులు వారి పిల్లల చేతిరాతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ జోనల్ చైర్మన్‌గా ఓరుగంటి

మాచర్ల: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వి204ఎ జోన్ చైర్మన్‌గా వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవరావు నరసరావుపేటలోని కళ్యాణ మండపంలో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని గురువారం జరిపినట్లు గవర్నర్ మునగాల చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా ఓరుగంటి చెన్నకేశవరావును మాచర్ల, గురజాల, పిడుగురాళ్ల, రెంటచింతల పరిధిలోని క్లబ్‌లకు జోనల్ చైర్మన్‌గా ఎంపిక చేయటం జరిగిందని చిరంజీవి తెలిపారు. ఈ మేరకు నియామక పత్రాన్ని అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. జోన్ చైర్మన్‌గా ఎంపికైన ఓరుగంటి చెన్నకేశవరావును ఆర్యవైశ్యులు, స్వచ్ఛంద సేవా సంస్థ నాయకులు, జర్నలిస్టులు, వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, మేడం నాగేశ్వరరావు, రవితేజ, నరసింహారావు అభినందించారు.

మండాదిలో రీ సర్వే ప్రారంభం



వెల్దుర్తి: మండలంలోని మండాది గ్రామంలో రెవెన్యూ శాఖాధికారులు రీ సర్వే ప్రారంభించినట్లు తహసీల్దార్ బాషా అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ ప్రభుత్వం రెవెన్యూ భూముల రీ సర్వే పనులను చేపట్టిందన్నారు. అందులో భాగంగా మండలంలోని మండాది గ్రామంలో రెవెన్యూ శాఖాధికారులు సర్వే నిర్వహిస్తున్నారన్నారు. పొలాల సరిహద్దులు గుర్తించే పనులను పరిశీలిస్తున్నామన్నారు. సర్వేయర్, వీఆర్‌ఏలు పొలాల మధ్య సరిహద్దు రాళ్లను గుర్తించి సర్వే చేస్తున్నారన్నారు.

మాచర్లకు విచ్చేసిన 'సంక్రాంతికి వస్తున్నాం' డైరెక్టర్



మాచర్ల: పట్టణంలోని శ్రీనివాస థియేటర్‌లో బుధవారం రాత్రి సెకండ్ షోకు 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా డైరెక్టర్ అనిల్ రావిపూడి విచ్చేసినట్లు థియేటర్ యాజమాన్యం జాని గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు వినోదాన్ని, కుటుంబ పరంగా అందించేందుకు సంక్రాంతికి వస్తున్నాం సినిమాను ప్రేక్షకులందరూ ఆదరిస్తున్నందుకు సంతోషమన్నారు. సినిమా విజయవంతం అయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో అమర్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్ పుట్టిన రోజు కార్యక్రమం

మాచర్ల: పట్టణంలోని పలు ప్రాంతాలలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పుట్టిన రోజు వేడుకలను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, కంభంపాటి అనిల్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. సెయింట్ ఆన్స్, చిన్న కాన్వెంట్, పాత కూరగాయల మార్కెట్ ప్రాంతాలలో కేక్‌లు కట్ చేసి పంపిణీ చేశారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

శాంతిబాయికి తెలుగు కీర్తి పురస్కారం అందజేత



మాచర్ల: పట్టణ ఉపాధ్యాయురాలు శాంతిబాయికి సాహిత్య సేవలకు శ్రీ శ్రీ కళా వేదిక బుధవారం రాత్రి తెలుగు కీర్తి పురస్కారాన్ని పురస్కారాన్ని అందజేసింది. అనేక సంవత్సరాలుగా సాహిత్య సేవలో ముందంజలో ఉన్న ఆమెను అభినందిస్తూ పద్మవిభూషణ్ గ్రహీత భీమన్న సతీమణి హైమావతి కళావేదిక సీఈఓ, లలిత, బాలార్జున్ చేతుల మీదుగా ఆమెకు తెలుగు కీర్తి పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను ప్రసంశించి సత్కరించి అభినందించారు.

సుందరంగా నడికుడి రైల్వే స్టేషన్

ప్లాట్‌ఫాంలు మారేందుకు లిఫ్ట్‌లు, నూతనంగా రైల్వే ట్రాక్ ఏర్పాటు

దాచేపల్లి : నడికుడి రైల్వే జంక్షన్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గుంటూరు డివిజన్‌లో రెండో అతిపెద్ద రైల్వే జంక్షన్ అయిన నడికుడి రైల్వే స్టేషన్‌ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ జంక్షన్ మీదుగా సికింద్రాబాద్, విశాఖపట్నం, చెన్నై, ముంబై తదితర ప్రాంతాలకు రైళ్లు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని వసతులు కల్పిస్తున్నారు. ప్రయాణికులు ప్లాట్‌ఫాంలు మారేందుకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో 2 లిఫ్టులు ఏర్పాటు చేశారు. మొదటి ప్లాట్‌ఫాంపై మార్బుల్స్ వేస్తున్నారు. ప్రయాణికులు కుర్చునేందుకు వీలుగా బెంచీలు ఏర్పాటు చేస్తున్నారు. స్టేషన్ బయట సిమెంట్ ప్లాట్‌ఫాం నిర్మిస్తున్నారు. స్టేషన్ మీదుగా రైళ్లు, గూడ్స్ రైళ్ల రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్లాట్‌ఫాంల సంఖ్యను 3 నుంచి 5కు పెంచుతున్నారు. అదనంగా రెండు రైల్వే ట్రాక్‌లను నిర్మిస్తున్నారు. ప్రయాణికులు విశ్రాంతి తీసుకునేందుకు విశ్రాంతి భవనం కూడా నిర్మిస్తున్నారు. స్టేషన్ చుట్టూ నూతనంగా ప్రహారీగోడ నిర్మిస్తున్నారు. నడికుడి రైల్వే జంక్షన్‌ని సుందరంగా తీర్చిదిద్దేందుకు రైల్వే అధికారులు చర్యలు తీసుకున్నారు.



రైల్వే స్టేషన్‌లో నిర్మించిన లిఫ్టులు

నేతాజీ జీవితం యువతకు ఆదర్శం

హెచ్‌ఎం బిల్లా ప్రతాప్



నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం బిల్లా ప్రతాప్



నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గ్రామ పెద్దలు

రెంటచింతల: దేశ స్వతంత్ర్య పోరాటంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాత్ర ఎంతో కీలకమైందని ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శమని హెచ్‌ఎం బిల్లా ప్రతాప్, వేంకటేశ్వరస్వామి దేవస్థానం అధ్యక్షుడు నాళం పెదబాబు అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక సుబ్బన్నతోట కాలనీలోని మండల పరిషత్ పాఠశాలలో నేతాజీ విగ్రహానికి హెచ్‌ఎం ప్రతాప్, అర్చకులు ఓరుగంటి మారుతీ శర్మ, ఉపాధ్యాయులతో, ప్రధాన రహదారి వెంబడి ఉన్న నేతాజీ విగ్రహానికి నాళం పెదబాబు, గ్రామ పెద్దలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన నేతల జీవిత చరిత్రలను విద్యార్థులకు తెలియజేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. నాళం పెదబాబు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలను, జీవితాలను త్యాగం చేసిన మహానుభావులను స్మరించుకోవడం మరవకూడదన్నారు. ఈ కార్యక్రమంలో కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షుడు నారాయణం శ్రీనివాస్, డాక్టర్ ఎంబీ చిన్నమ్మ, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, విద్యార్థులు, గ్రామ పెద్దలు కోటయ్య, బాలరెడ్డి, సైదులు, నీలారెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుభాష్ చంద్రబోస్ యువతకు ఆదర్శమని అన్నారు. అంతే కాకుండా ఆయన ధైర్యసాహసాలను ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మాచర్లలో సుభాష్ చంద్రబోస్ జయంతి

మాచర్ల : నేతాజీ సుభాస్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలు గురువారం మాచర్ల శ్రీశైలం రోడ్డులోని స్వామి వివేకానంద సేవాశ్రమంలో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మొట్టు గోవిందరెడ్డి పాల్గొని చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థి దశ నుంచే నేతాజీని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆయన పోరాటం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, చిన్నారులు పాల్గొన్నారు



నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మొట్టు గోవిందరెడ్డి తదితరులు

డ్రైనేజీ సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్



పిడుగురాళ్ల: డ్రైనేజీ సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. పట్టణంలోని 28వ వార్డులో గురువారం పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. అదే విధంగా సైడు కాలువల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, దాని వలన దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని కావున సైడు కాలవల్లో చెత్త వేయకుండా చూడాలని సిబ్బందికి తెలియజేశారు. వీధి లైట్లు వెలగకపోతే వెంటనే తెలియజేస్తే వాటిని కూడా బాగు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

26న మాంసం విక్రయాలు నిషేధం

పిడుగురాళ్ల: ఈ నెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవం సందర్భంగా మాంసం విక్రయాలు నిషేధించటం జరిగిందని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. 26 ఆదివారం కావటం వలన ఎవరైనా షాపులను తీసి విక్రయాలు చేస్తే సహించేది లేదన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, మాంసం విక్రయాలు నిర్వహించే వారు షాపులను మూసివేయాలని ఆయన ఆదేశించారు.

ఇలాంటి రోడ్డులో ప్రయాణం ఎలా..?!

గురజాల : ఆర్ అండ్ బీ పరిధిలో గతుకుల రోడ్డుతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మండల పరిధిలోని పల్లెగుంత రహదారిలో అక్కడక్కడ గుంతలు దర్శనమిస్తున్నాయి. చర్లగుడిపాడు గ్రామం నుంచి ఒప్పిచర్ల రహదారి అస్తవ్యస్తంగా మారింది. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ రహదారిలో ప్రయాణం నరకంగా మారుతుందని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రహదారులు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



గుంతల మయంగా పల్లెగుంత రోడ్డు

దుప్పట్లు పంపిణీ



మాచర్ల: పట్టణంలోని కుష్ఠ రోగుల కాలనీలో గురువారం డ్రీమ్ విలేజ్ సొసైటీ ఆధ్వర్యంలో లెప్రసీ కాలనీ వాసులకు దుప్పట్లు, రొట్టెలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ కొండూరి ప్రశంశన యోమి, చైర్మన్ సుధాకర్‌రావులు మాట్లాడుతూ ప్రతి ఏడాది డ్రీమ్ విలేజ్ సొసైటీ విద్యాభివృద్ధితో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. తమ సంస్థ సేవలో ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొండూరి లెనిన్‌బాబు, లలిత కుమారి, ప్రతినిధులు రాంబాబు, మేరి రత్నకుమారి, అబ్దుల్లా, గ్లోరి తదితరులున్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడికి గాయాలు

పిడుగురాళ్ల : ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడికి గాయాలైన ఘటన పిడుగురాళ్ల మండలంలోని కామేపల్లి సమీపంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం మాచవరం నుంచి బ్రాహ్మణపల్లి వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న యువకుడు కామేపల్లి బైపాస్ రోడ్డు నుంచి మాచవరం వైపు వస్తున్న సైకిల్‌ను తప్పించబోయి రోడ్డు మార్జిన్‌లో ద్విచక్ర వాహనం అదుపుతప్పింది. దీంతో వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని 108 వాహనం ద్వారా పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలి

ఎంవీఐ రాంబాబు



పిడుగురాళ్ల: ట్రాఫిక్ రూల్స్ ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని ఎంవీఐ రాంబాబు అన్నారు. పట్టణంలోని స్కాలర్ జూనియర్ కాలేజీలో అవగాహన ర్యాలీ నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయటం సరి కాదని, హెల్మెట్ వలన ఎంతో మంది ప్రాణాలను కాపాడుకున్నారని తెలియజేశారు. 18 సంవత్సరాలు నిండిన వారు మాత్రమే వాహనాలు నడపాలని, తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేనిచో అపరాధ రుసుం విధించబడుతుందని తెలిపారు. పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు మాట్లాడుతూ పిల్లలు డ్రైవింగ్ చేస్తూ వీధుల్లో తిరుగుతున్నారని వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. వాహనంపై ఇద్దరికి మించి ఎక్కితే ఊరుకోమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కాలర్స్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆవుల జనార్దన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవు

డీఎస్పీ జగదీష్



గురజాల : ఎవరైనా గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ జగదీష్ అన్నారు. మండల పరిధిలోని గొట్టిముక్కల గ్రామంలో పుష్కర ఘాట్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరాష్ట్ర సరిహద్దు కావడంతో మద్యం అక్రమ రవాణా జరుగకుండా, జూదం వంటివి నిర్వహించకుండా డ్రోన్ సహాయంతో ఎప్పటికప్పుడు పరిస్థితులు గమనించడం జరుగుతుందన్నారు. పోలీసులకు ప్రజలు సహకరించాలన్నారు. డీఎస్పీతో పాటు సీఐ ఆవుల భాస్కర్, ఎస్ఐ వై వినోద్ కుమార్‌లు పాల్గొన్నారు.

వ్యక్తి కనిపించడం లేదంటూ ఫిర్యాదు



మాచవరం: తమ కుమారుడు కనిపించడం లేదంటూ స్థానిక పోలీస్‌స్టేషన్లో గురువారం ఫిర్యాదు చేసినట్లు అట్ల వెంకటేష్ తల్లిదండ్రులు తెలిపారు. వివరాల ప్రకారం మండల కేంద్రమైన మాచవరం గ్రామానికి చెందిన అట్ల వెంకటేష్ ఈ నెల 20న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బంధువులు, స్నేహితులు వద్ద వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9550215122 నెంబర్‌కు తెలియజేయాలని కోరారు.

28న కల్యాణం.. రథోత్సవం

పిడుగురాళ్ల : ఈ నెల 28వ తేదీన పంచముఖ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో స్వామి వారి కల్యాణ మహోత్సవం జరుగుతుందని కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. అదే రోజు సాయంత్రం స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. రథోత్సవం ఏర్పాట్లను కమిటీ సభ్యులు గురువారం దగ్గరుండి పర్యవేక్షించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.



పశు ఆరోగ్య శిబిరాలు పాడి రైతులకు మేలు

గోలి(రెంటచింతల): రాష్ట్ర పశు సంవర్ధక శాఖ గ్రామాలలో నిర్వహిస్తున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరాలతో పాడి రైతులకు ఎంతో మేలు కలుగుతుందని మండల పశు వైద్యాధికారి షేక్ బషీర్ అన్నారు. గురువారం మండలంలోని గోలి గ్రామంలో జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం సౌజన్యంతో నిర్వహించిన ఆరోగ్య శిబిరాన్ని సర్పంచ్ మున్నా చంద్రంతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. 38 మంది పశు పోషకకులకు చెందిన 14 ఆవులకు, 24 గేదెలకు గర్భకోశ వ్యాధి పరీక్షలు, అనారోగ్యంగా ఉన్న 54 పశువులకు చికిత్సలు చేయడం జరిగిందన్నారు. 600 జీవాలకు బొబ్బ వ్యాధి టీకాలు, దూడలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు టి.బాబు, రమేష్‌నాయక్, కె.త్రివేణి, ఎ.కవిత, గ్రామ పెద్దలు కోరే నాగేశ్వరరావు, కె.కోటేశ్వరావు, త్రిపుర గోవర్ధన్‌రావు, తోడిచర్ల థామస్, కె.వీరాంజనేయులు పాల్గొన్నారు.



గేదెకు పరీక్ష చేస్తున్న మండల పశువైద్యాధికారి షేక్ బషీర్

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గురజాల రూరల్ (దైద) : పశు ఆరోగ్య శిబిరాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి కె.ఉమామహేశ్వరి సూచించారు. మండల పరిధిలోని దైద గ్రామంలో పశు ఆరోగ్య శిబిరాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం 38 మంది రైతులు పాల్గొన్నారని నట్టల నివారణ మందు-60, దూడల నట్టల నివారణ మందు-26, మేకలు, గొర్రెలు నట్టల నివారణ-56, గొర్రెలు బొబ్బ టీకాలు-400, మేకల బొబ్బ టీకాలు-200, చూడి పరీక్షలు-6, ఎద ఇంజక్షన్‌లు-4, ఇతర కేసులు-6 వచ్చినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు, పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్ రామారావు, దుర్గా, శ్రీనివాస్, లక్ష్మీ తదితరులున్నారు.



మేకలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు

మాచవరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏరియా పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని శ్రీరుక్మిణీపురం, రేగులగడ్డ గ్రామాల్లో గురువారం పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. శ్రీరుక్మిణీపురంలో 285, రేగులగడ్డలో 609 పశువులు, గొర్రెలు, మేకలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో చూడు పరీక్షలు, పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, నట్టల నివారణ మందులు, గొర్రెల్లో బొబ్బ వ్యాధి నివారణ మందులు అందజేసినట్లు పశు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు కె.వెంకటేశ్వరరావు, వి.రాము, పశు వైద్య సహాయకులు, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారు పేరు సెయింట్ జోసఫ్స్ పాఠశాల

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



రెంటచింతల: క్రమశిక్షణకు మారుపేరు సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం పాఠశాల కరస్పాండెంట్, రె.ఫాదర్ పీటర్ పాపయ్య, గ్రామ పెద్దలు కలిసి ఎమ్మెల్యే జూలకంటికి ఫిబ్రవరి 7న నిర్వహిస్తున్న పాఠశాల డైమండ్ జూబ్లీ వేడుకల ఆహ్వాన పత్రికను అందజేసిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. దేశంలోని అనేక ప్రాంతాలలో రోమన్ క్యాథలిక్ మిషన్ (ఆర్సీఎం) వందల సంఖ్యలో పాఠశాలలను నిర్మించి ఎంతో సేవ చేసినట్లు కొనియాడారు. ఈ సెయింట్ జోసఫ్స్ పాఠశాలలో క్రమ శిక్షణ, విలువలతో కూడిన విద్యను అందిస్తూ అనేక మందికి మంచి భవిష్యత్‌ను కల్పించిందన్నారు. తన వంతుగా పాఠశాల డైమండ్ జూబ్లీ వేడుకలకు రూ.1 లక్ష అందజేశారు. ఈ కార్యక్రమంలో అల్లం ప్రతాప్‌రెడ్డి, ఆదూరి ఇన్నారెడ్డి, తుమ్మా జోజిరెడ్డి, ఏరువ జోజిరెడ్డి, మూలి రాయపరెడ్డి తదితరులున్నారు.

ఈ క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలి

కారెంపూడి: మండలంలోని వివిధ గ్రామాలలో పని చేస్తున్న వీఏఏఈఓ, వీహెచ్ఏలు, ఎంపీఈఓల సమావేశాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి బి.యలమందారెడ్డి గురువారం నిర్వహించారు. రబీలో వేసిన పంటల వివరాలతో ఈ క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలని, పీఎం కిసాన్ పథకం కింద లబ్ధిదారుల ఈ కేవైసీలు పెండింగ్ పూర్తి చేయాలని, ఏబీపీఎస్ చేయించాలని, పాడి పంటల మ్యాగజైన్‌లను రైతులకు అందుబాటులోకి తీసుకెళ్లాలని ఏఓ యలమందారెడ్డి వ్యవసాయ శాఖ సిబ్బందిని ఆదేశించారు. కందులు క్వింటా రూ.7,700 ప్రభుత్వ మద్దతు ధర ఉందని ఎన్నడూ లేని విధంగా అంతకంటే తక్కువ బహిరంగ మార్కెట్‌లో రూ.6,200 రేటు ఉందని రైతులకు లబ్ధి చేకూర్చేందుకు మద్దతు ధరకు కందులను కొనేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆర్‌బీకేల నిర్వాహకులను ఏఓ ఆదేశించారు.



మాట్లాడుతున్న ఏఓ యలమందారెడ్డి

పాఠశాలల బస్సులను తనిఖీ చేసిన ఆర్టీఓ

కారెంపూడి: మాచర్ల ఆర్టీఓ శేషురెడ్డి కారెంపూడిలో ప్రైవేటు పాఠశాలల బస్సులను గురువారం తనిఖీ చేశారు. 30 బస్సులను తనిఖీ చేసి ఫిట్‌నెస్, ఇతర పత్రాలు సరిగాలేని 5 వాహనాలపై కేసులు నమోదు చేశారు. పాఠశాలల పిల్లలు ప్రయాణించే బస్సులు నడిపే డ్రైవర్లు మద్యం తాగి బస్సులు నడుపుతూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ విషయంలో పాఠశాలల యాజమాన్యాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బస్సులు కూడా పూర్తి కండిషన్‌లో ఉంచాలని తగిన భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని ఆర్టీఓ సూచించారు. అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



బస్సును తనిఖీ చేస్తున్న ఆర్టీఓ శేషురెడ్డి